పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 100. అల్ ఆదియాత్ సూరా పరిచయం

మక్కాలో అవతరించింది. 11 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

ఇందులో గుర్రాలను ఉదాహరణగా అల్లాహ్ సెలవిస్తున్నాడు. గుర్రాలు ఏ విధంగా విశ్వాసపాత్రంగా విధేయతను తమ యజమాని పట్ల కలిగి ఉంటాయో, మనిషి అల్లాహ్ పట్ల అంతమాత్రం విశ్వాస పాత్రత, కృతజ్ఞత చూపడం లేదు. అంటే మనిషి జంతువుకన్నా హీనమయిపోయాడు. అతని విధేయత పాటించని, విశ్వాసం చూపని గుర్రానికి అతడి వద్ద ఎటువంటి విలువా గౌరవం లేవని కూడా మనిషికి తెలుసు. అదేవిధంగా మనిషి అల్లాహ్‌కు కృతజ్ఞత చూపకపోతే, అతడ్ని ఆరాధించకపోతే అల్లాహ్ వద్ద అతనికి ఎటువంటి విలువా గౌరవం ఉండవని అతడు గ్రహించడేమిటి? గుర్రాలు తమ యజమానికి ఎలా విశ్వాసపాత్రమవుతాయో మనిషి కూడా తన ప్రభువుకు విశ్వాస పాత్రుడవుతే అందులోనే అతడికి సాఫల్యం ఉంది.

## 100. అల్ ఆదియాత్

**ఆయత్‌లు : 11** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) ఒగరుస్తూ పరుగు తీసే గుర్రాల సాక్షి!

(2) మరి తమ నాడాల నుండి నిప్పు రవ్వలు కురిపిస్తాయి.

(3) ఇంకా ఉదయం వేళ దాడి చేస్తాయి.

(4) ఆ సందర్భంగా దుమ్మూ ధూళి రేపుతాయి.

(5) ఇంకా అప్పుడు శత్రుసైన్యంలో చొరబడతాయి.

(6) యదార్థం ఏమంటే మనిషి తన ప్రభువుకు కృతఘ్నుడు.

(7) అతడికి ఆ విషయమూ తెలుసు. (8) అతడు సిరిసంపదల పట్ల వ్యామోహం కలవాడు

(9) సమాధులలో ఉన్నదంతా బయటికి తీయబడే ఆ సమయం గురించి ఎరుగడా?

رُكُوعُهَا 1 سُوْرَةُ الْعٰدِيٰتِ مَكِّيَّةٌ 100 اٰيَاتُهَا 11

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

وَالۡعٰدِيٰتِ ضَبۡحًا ۙ ﴿1﴾

فَالۡمُوۡرِيٰتِ قَدۡحًا ۙ ﴿2﴾

فَالۡمُغِيۡرٰتِ صُبۡحًا ۙ ﴿3﴾

فَاَثَرۡنَ بِهٖ نَقۡعًا ۙ ﴿4﴾

فَوَسَطۡنَ بِهٖ جَمۡعًا ۙ ﴿5﴾

اِنَّ الۡاِنۡسَانَ لِرَبِّهٖ لَكَنُوۡدٌ ۚ ﴿6﴾

وَاِنَّهٗ عَلٰى ذٰلِكَ لَشَهِيۡدٌ ۚ ﴿7﴾

وَاِنَّهٗ لِحُبِّ الۡخَيۡرِ لَشَدِيۡدٌ ؕ ﴿8﴾

اَفَلَا يَعۡلَمُ اِذَا بُعۡثِرَ مَا فِى الۡقُبُوۡرِ ۙ ﴿9﴾

| | |
|---|---|
| (10) మనసులలో ఉన్న మర్మాలు వెలిబుచ్చ బడతాయి. | وَحُصِّلَ مَا فِي الصُّدُورِ ﴿10﴾ |
| (11) నిశ్చయంగా వారి ప్రభువు ఆ రోజున వారిని గురించి బాగా తెలుసుకుంటాడు. | إِنَّ رَبَّهُم بِهِمْ يَوْمَئِذٍ لَّخَبِيرٌ ﴿11﴾ ع 1 11 25 |

100. అల్ ఆదియాత్ వివరణలు

1 – 11 వాక్యాలు

మరణించి దైవాన్ని చేరుకోవడం ఉండదని, లెక్కలు చూపవలసిన పని లేదని మనిషి భావించినప్పుడు, అతడి జీవితం పెడదారి పడుతుంది. ఇల్లు, కుటుంబం, సమాజం, హంతకులు, దొంగలు, దుర్మార్గులతో నిండిపోతాయి. ఇక మానవ సమాజం సుఖశాంతులను కోల్పోతుంది. ఇందుకు అరేబియాలో వ్యాపించి ఉన్న అశాంతిని రుజువుగా చూపడం జరిగింది. దేశం యావత్తు విసిగివేసారి పోయింది. ఎటుచూసినా హత్యాకాండ, రక్తపాతం, దోపిడీ విస్తృతం అయిపోయింది. ఏ మనిషీ రాత్రి ప్రశాంతంగా నిద్రించలేక పొయ్యేవాడు. శత్రువు ఎవరైనా తన బస్తీపై ఎప్పుడు దాడి చేస్తాడో తాము సర్వనాశనం అయిపోతామో అన్న భయం వెన్నంటి ఉండేది. ఈ పరిస్థితి అరబ్బు ప్రజలందరూ ఎరిగినదే. ఈ చెడుగును అందరూ గ్రహించిన వారే. ఈ పరిస్థితులను వేలెత్తిచూపుతూ, ఆఖిరత్‌ను అంగీకరించని కారణంగా మనిషి తన ప్రభువుకు కృతఘ్నుత చూపుతాడని, దైవమిచ్చిన శక్తుల్ని హింసాదౌర్జన్యాలు, దోపిడీ కోసం ఉపయోగిస్తాడని సిరిసంపదల వ్యామోహంలో అంధుడై అన్ని విధాలుగా దాన్ని ఆ విధానం ఎంతగా తప్పయినా సరే వాటిని పొందే ప్రయత్నం చేస్తాడని చెప్పబడింది. మానవుడు గనుక ఆఖిరత్‌ను అంగీకరించి, దైవం ఎదుట తన జీవితపు లెక్క ఇవ్వాలని గ్రహించినట్లయితే, అటువంటి పరిస్థితిలో మనిషి దైవానికి కృతజ్ఞత చెల్లిస్తాడు. మానవాళి పట్ల అభిమానం చూపుతాడు.

https://teluguislam.net/quran/